## నేడు కున్ హ్యుండాయ్ దసరా బొనాంజా

జూబ్లీహిల్స్, అక్టోబర్ 8 : నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే సంయుక్తాధ్వర్యంలో సోమవారం లక్డీకాపూల్‌లోని కున్ హ్యుండాయ్ దసరా షాపింగ్ బొనాంజా వేడుకలను హ్యుండాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ జోనల్ బిజినెస్ హెడ్ రామన్ భాటియా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి హ్యుండాయ్ మోటర్ ఇండియా లిమిటెడ్ జోనల్ కో-ఆర్డినేటర్ క్వాన్ హీ హాన్, నమస్తే తెలంగాణ-తెలంగాణ టుడే సంపాదకవర్గం హాజరుకానున్నారు.

## ఎన్నికల వ్యయ పరిశీలకులుగా 21 మంది నియామకం

సిటీబ్యూరో, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): రానున్న అసెంబ్లీ ఎన్నికలకు నియోజకవర్గాల వారీగా ఎన్నికల వ్యయాన్ని మానిటరింగ్ చేయడానికి 21 మంది ఎన్నికల వ్యయ పరిశీలనాధికారుల(ఏఈఓ)ను నియమిస్తూ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఉత్తర్వులు జారీ చేశారు.15 నియోజవకర్గాల్లో 15 మంది ఏఈవోలు, రిజర్వ్‌గా మరో ఆరుగురిని నియమించారు. ఎన్నికల రిటర్నింగ్ ఆదేశాల ప్రకారం అభ్యర్థుల ఎన్నికల వ్యయాన్ని పరిశీలించి నివేదిక ఇవ్వనున్నారు.

## సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను విజయవంతంగా నిర్వహిస్తున్నాం

- నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప


మాట్లాడుతున్న నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్ప

ఖైరతాబాద్, అక్టోబర్ 8: సంక్లిష్టమైన శస్త్ర చికిత్సలను నిమ్స్ దవాఖానలో విజయవంతంగా నిర్వహిస్తున్నామని డైరెక్టర్ డాక్టర్ బీరప్ప తెలిపారు. నిమ్స్ ఆర్థోపెడిక్ విభాగం ఆధ్వర్యంలో ఆర్థో ఆంకాలజీ అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ బీరప్ప మాట్లాడుతూ... నిమ్స్ ఆర్థోపెడిక్ విభాగానికి చరిత్ర ఉందని, ఆ సమస్యలతో వచ్చే రోగులకు అత్యద్భుతమైన చికిత్స అందిస్తున్నామని చెప్పారు. కార్పొరేట్‌కు దీటుగా లక్షల్లో ఖర్చయ్యే జాయింట్ రీప్లేస్‌మెంట్, నీ రీప్లేస్‌మెంట్ లాంటి చికిత్సలను నిమ్స్‌లో ప్రభుత్వ ఆరోగ్య పథకాలతో ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. అలాగే సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగం వైద్యులు ఆధునిక చికిత్స విధానాన్ని అవలంబిస్తూ క్లిష్టమైన వ్యాధులను నయం చేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సదస్సులో నిమ్స్ డీన్ లీజా రాజశేఖర్, ఆర్థోపెడిక్ ఆంకో సర్జన్ డాక్టర్ మనీష్ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


నియామక పత్రాలను అందుకున్న ఉమ్మడి హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల వెటర్నరీ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం

## వెటర్నరీ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్

- వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

తెలుగు యూనివర్సిటీ, అక్టోబర్ 8 : ఉమ్మడి హైదరాబాద్-రంగారెడ్డి జిల్లాల వెటర్నరీ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు రాష్ట్ర అధ్యక్షుడు సోడయ్య యాదవ్ వెల్లడించారు. నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం తెలంగాణ రాష్ట్ర వెటర్నరీ కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్ట్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఉమ్మడి జిల్లాల నూతన కార్యవర్గం ఏర్పాటైనట్లు ఆయన తెలిపారు. అధ్యక్షుడిగా అరూరు కిశోర్ కుమార్, కార్యదర్శిగా జి. రవీందర్ రెడ్డి, కోశాధికారిగా కె. రాఘవేందర్, గౌరవ అధ్యక్షులుగా పి. వరప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శిగా యం. వెంకటేశ్వర రావులను ఎన్నుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఏపీపీ అథారిటీ తనిఖీలను ఎలా ఎదుర్కోవాలి అనే అంశంపై ముఖ్య అతిథిగా హాజరైన ఔషధ తనిఖీ అధికారుల సంఘం జాతీయ అధ్యక్షుడు కోటేశ్వరరావు ప్రసంగించి మార్గనిర్దేశం చేశారు. త్వరలో జరగబోయే తెలంగాణ ఫార్మసీ కౌన్సిల్ ఎన్నికల విధివిధానాలను తెలియజేశారు. విశ్రాంత ఎస్పీ కె.కృష్ణతో పాటు ఉమ్మడి హైదరాబాద్ - రంగారెడ్డి జిల్లాలకు చెందిన 70మంది కెమిస్టులు, ఫార్మాసిస్టులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ చిక్కుల్లేకుండా..

- వేగంగా పట్టణీకరణ
- కొత్త లింకు రోడ్లతో రేడియల్ రోడ్లకు అనుసంధానం
- భవిష్యత్తులో ట్రాఫిక్ చిక్కుల్లేకుండా హెచ్‌ఎండీఏ ప్రణాళిక
- నిధుల కొరత లేకుండా రోడ్ల నిర్మాణం

సిటీబ్యూరో, అక్టోబర్ 8(నమస్తే తెలంగాణ): ఔటర్ రింగు రోడ్డు లోపల అత్యంత మెరుగైన రోడ్డు నెట్‌వర్క్‌ను నిర్మించడమే లక్ష్యంగా చేసుకొని హెచ్‌ఎండీఏ శివారు ప్రాంతాల్లో కొత్తగా రోడ్లను నిర్మిస్తోంది. ముఖ్యంగా నగరంలోని ఇన్నర్ రింగు రోడ్డు నుంచి గ్రేటర్ చుట్టూ 158 కి.మీ మేర ఉన్న ఔటర్ రింగు రోడ్డును కలుపుతూ పలు ప్రాంతాల్లో ఇప్పటికే రేడియల్ రోడ్ల నిర్మాణం చేపట్టింది. హైదరాబాద్ మహానగరం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని మాస్టర్ ప్లాన్‌లో పొందుపర్చిన 33 రేడియల్ రోడ్లను దశల వారీగా నిర్మించగా, శివార్లలో శరవేగంగా పట్టణీకరణ జరుగుతున్న నేపథ్యంలో రేడియల్ రోడ్లను అనుసంధానిస్తూ కొత్త రోడ్లను హెచ్‌ఎండీఏ నిర్మిస్తోంది. ఇందులో భాగంగా బాలానగర్‌లోని నర్సాపూర్ ఎక్స్ రోడ్డు నుంచి జీడిమెట్ల, సూరారం మీదుగా దుండిగల్ ఓఆర్ఆర్ వరకు రేడియల్ రోడ్డుకు ఇరువైపులా రెండు చోట్ల విస్తరణ పనులను హెచ్‌ఎండీఏ చేపట్టింది. ఇందులో మొదటగా నాగ్‌పూర్ జాతీయ రహదారిపై ఉన్న కొంపల్లి నుంచి బహదూర్‌పల్లి మీదుగా సూరారం వరకు, అలాగే గండిమైసమ్మ చౌరస్తా నుంచి మియాపూర్ వరకు ఉన్న రోడ్డు మార్గంలో బాచుపల్లి-నిజాంపేట సర్కిల్ నుంచి మల్లంపేట ఓఆర్ఆర్ ఇంటర్‌చేంజ్ వరకు మొత్తం రూ.205 కోట్లతో విశాలమైన రహదారులను నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ పనులు పురోగతిలో ఉన్నాయి. నగరానికి ఉత్తర భాగంలో రోజు రోజుకు పెరుగుతున్న పట్టణీకరణ నేపథ్యంలో రోడ్ల విస్తరణ పనులు, జాతీయ రహదారులు, రేడియల్ రోడ్లతో అనుసంధానం చేస్తోంది.

### తెల్లాపూర్ నుంచి శంకర్‌పల్లి వరకు..

జీహెచ్‌ఎంసీ పరిధి తర్వాత ఉన్న శివారు మున్సిపాలిటీల్లో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న వాటిలో నిజాంపేట, కొంపల్లి, దుండిగల్, అమీన్‌పూర్ మున్సిపాలిటీతో పాటు ఐటీ కారిడార్ వైపు తెల్లాపూర్,


బంజారాహిల్స్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద తెలంగాణ భవన్ పక్క నుంచి నూతనంగా నిర్మిస్తున్న లింకురోడ్డు

నార్సింగి, మణికొండ మున్సిపాలిటీల్లో కొత్త రోడ్లను నిర్మించేందుకు హెచ్‌ఎండీఏ అధిక మొత్తంలో నిధులను కేటాయిస్తోంది. దీంతో పాటు ఆర్ అండ్ బీ, టీఎస్ఐఐసీ, హెచ్‌ఆర్‌డీసీఎల్‌లు లింకు రోడ్ల నిర్మాణం పనులు చేపడుతున్నారు. ఇందులో అత్యంత కీలకమైంది. తెల్లాపూర్ నుంచి శంకర్‌పల్లి వరకు నిర్మించిన రేడియల్ రోడ్డు. మొదట తెల్లాపూర్ వరకు ఉన్న ఈ రోడ్డును స్థానికంగా పెరుగుతున్న పట్టణీకరణను దృష్టిలో పెట్టుకొని లింగంపల్లి నుంచి తెల్లాపూర్ మీదుగా ఈదులనాగులపల్లి, కొండకల్ మీదుగా ఉన్న రైల్వే ట్రాక్ లోపలి వైపు రేడియల్ రోడ్డును నిర్మించారు. ప్రస్తుతం ఈ పనులు చివరి దశలో ఉన్నాయి. దీంతో మరో రేడియల్ రోడ్డును విప్రో సర్కిల్ నుంచి గౌలిదొడ్డి, గోపన్‌పల్లి, తెల్లాపూర్, ఉస్మాన్‌నగర్ మీదుగా కొల్లూరు వరకు రేడియల్ రోడ్డును నిర్మించారు. దీనికి అనుసంధానంగా గోపన్‌పల్లి నుంచి వట్టినాగులపల్లి వైపు, అలాగే నల్లగండ్ల మీదుగా శేరిలింగంపల్లి రేడియల్ రోడ్లను విస్తరిస్తూ నిర్మాణం పనులు చేపట్టారు.

### తూర్పున సైతం మరో లింకు రోడ్డు..

నగరానికి ఉత్తర, పడమర దిక్కుల్లోనే కాకుండా తూర్పు వైపున సైతం ఇన్నర్ రింగు రోడ్డు, ఔటర్ రింగు రోడ్డు మధ్య కొత్తగా లింకు రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారు. ఇప్పటికే నాగోల్ ఇన్నర్ రింగు రోడ్డు నుంచి గౌరెల్లి వరకు ఉన్న రేడియల్ రోడ్డుకు అనుసంధానంగా నాగోల్ జీఎస్ఐ నుంచి ఫతుల్లాగూడ మీదుగా మూసీ, ఉప్పల్ భగాయత్ వైపు పీర్జాదిగూడ ప్రధాన రహదారి వరకు కొత్తగా లింకు రోడ్డు నిర్మాణం చేపట్టారు. ఈ మార్గంలో ఫతుల్లాగూడ వరకు 100 అడుగుల రోడ్డు నిర్మాణం పూర్తి కాగా, మూసీనది పై ఉప్పల్ భగాయత్ వద్ద హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి ఇటీవలే మంత్రి కేటీఆర్ శంకుస్థాపన చేశారు. ఈ లింకు రోడ్డు నిర్మాణం పూర్తయితే విజయవాడ జాతీయ రహదారి నుంచి వరంగల్ జాతీయ రహదారికి మధ్య అత్యంత అనుకూలమైన లింకు రోడ్డు పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. కొత్తగా లింకు రోడ్ల నిర్మాణం వల్ల చుట్టుపక్కల ప్రాంతాల్లో పట్టణీకరణ మరింత వేగంగా చోటు చేసుకుంటోంది. తెలంగాణ ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ప్రధాన రహదారులకు ప్రత్యామ్నాయంగా లింకు రోడ్లను అభివృద్ధి చేయడంపై ప్రత్యేకంగా దృష్టి పెట్టింది. అందులో భాగంగానే ఇప్పటి వరకు 137కు పైగా లింకు రోడ్ల నిర్మాణం పనులను చేపట్టింది. ఇంకా ఎక్కడ అవసరమో గుర్తించి, అక్కడ క్షేత్ర స్థాయిలో జీహెచ్‌ఎంసీ, హెచ్‌ఎండీఏతో పాటు స్థానిక మున్సిపాలిటీ అధికారులతో కలిసి లింకు రోడ్ల నిర్మాణానికి చర్యలు తీసుకుంటున్నారు. పెరుగుతున్న ట్రాఫిక్‌కు అనుగుణంగా మెరుగైన రోడ్ నెట్‌వర్క్‌ను కల్పించేందుకు వేల కోట్ల రూపాయలను ప్రభుత్వం వెచ్చిస్తోంది. లింకు రోడ్ల ద్వారా ప్రధాన రహదారులపై ట్రాఫిక్‌కు భారీగా ఊరట కలగడంతో పాటు ఎంతో విలువైన సమయం, ఇంధనం సైతం ఆదా కానుంది.

## ఉత్సాహంగా గ్లోబల్ క్యాన్సర్ గ్రేస్ రన్

### పాల్గొన్న సీపీ స్టీఫెన్ రవీంద్ర, సినీ నటి కాజల్ అగర్వాల్


జెండా ఊపి 10కె రన్‌ను ప్రారంభిస్తున్న జీహెచ్‌ఎంసీ కమిషనర్ రొనాల్డ్‌రాస్

శేరిలింగంపల్లి, అక్టోబర్ 8: గచ్చిబౌలి స్టేడియంలో గ్లోబల్ గ్రేస్ క్యాన్సర్ రన్-2023 ఆదివారం ఉత్సాహంగా సాగింది. కాన్సర్‌పై అవగాహన కల్పించేందుకు గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన 6వ ఎడిషన్ 5కే, 10కే, 21కే రన్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ నటి కాజల్ అగర్వాల్ హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రపంచ వ్యాప్తంగా క్యాన్సర్ అవగాహనకు నిర్వహించిన అతిపెద్ద మారథాన్‌గా గ్రేస్ క్యాన్సర్ రన్ నిలుస్తుందన్నారు. క్యాన్సర్ మహమ్మారి అతి వేగంగా వ్యాపిస్తుందని, నివారణకు ముందస్తు నిర్ధారణ ప్రధానమన్నారు. అనంతరం సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్ర మాట్లాడుతూ... మారథాన్ పూర్తి చేయడం ఆషామాషి కాదని దాని వెనక కఠోర శ్రమ దాగి ఉంటుందన్నారు. అంతకుముందు జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ 10కే రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇంజినీరింగ్ మైక్రోసాఫ్ట్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ విజయ్ మంతానీ, బెంగళూర్ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్క్స్ ఆఫ్ ఇండియా డైరెక్టర్ జేఏ చౌదరిలతో పాటు నగరానికి చెందిన వేలాది మంది ఉత్సాహంగా పాల్గొన్నారు.


మంత్రి హరీశ్ రావును మర్యాదపూర్వకంగా కలిసిన ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్

## ప్రజా సంక్షేమానికి కృషి చేస్తా

మల్కాజిగిరి, అక్టోబర్ 8: ప్రజల సంక్షేమానికి కృషి చేస్తానని ఎంబీసీ కార్పొరేషన్ చైర్మన్ నందికంటి శ్రీధర్ అన్నారు. ఆదివారం మంత్రి హరీశ్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో డోలి రమేశ్, లక్ష్మీనారాయణ, వి.శ్రీనివాస్‌గౌడ్, పవన్‌కుమార్, రాంరెడ్డి, సత్యనారాయణ, మల్లేశ్ యాదవ్, బుజ్జి, నామ్‌దాస్, హరికుమార్, బంటి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థరైటీస్ లేని సమాజాన్ని నిర్మిద్దాం

- నెక్లెస్‌రోడ్‌లో అవగాహన వాక్

ఖైరతాబాద్, అక్టోబర్ 8: ఆర్థరైటీస్ లేని సమాజాన్ని నిర్మిద్దామంటూ యువతీ,యువకులు ముందుకు కదిలారు. వరల్డ్ ఆర్థరైటీస్ డే సందర్భంగా కిమ్స్ హాస్పిటల్ రుమటాలజీ, క్లినికల్ ఇమ్యూనాలజీ విభాగం ఆధ్వర్యంలో ఆర్థరైటీస్‌పై అవగాహన వాక్ నిర్వహించారు. నెక్లెస్‌రోడ్‌లోని జలవిహార్ వద్ద ఏర్పాటు చేసిన ఈ వాక్‌ను కిమ్స్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ బి. భాస్కర్ రావు, దర్శక, నిర్మాతలు మారుతి, యాదగిరి రాజు, నటీనటులు సౌమ్యా రావు, కార్తిక్ రత్నంతో కలిసి ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ భాస్కర్ రావు మాట్లాడుతూ... ఆనందమైన జీవితానికి మూడు సూత్రాలు పాటించాలని, సమయానికి నిద్ర, మంచి ఆహారం, తగిన శారీరక శ్రమ (వ్యాయామం) చేయాలన్నారు. దైనందిన జీవితంలో వీటిని సక్రమంగా నిర్వహిస్తే ఆర్థరైటీస్ దరి చేరదని సూచించారు. డాక్టర్ శరత్ చంద్రమౌళి మాట్లాడుతూ... నేడు యువతలో చిన్న వయస్సులోనే వివిధ రకాల దీర్ఘకాలిక జబ్బులు వస్తున్నాయని, వాటన్నింటిని లైఫ్ స్టైల్ డిసార్డర్‌గా అభివర్ణించవచ్చన్నారు. పచ్చి ఆకుకూరలు తీసుకోవాలని, ప్రతి రోజు వ్యాయామం చేయాలని, రాత్రి 9గంటలకే సెల్‌ఫోన్లను చూడటం మానివేయాలని చెప్పారు.


వాక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ భాస్కర్ రావు, శరత్ చంద్రమౌళి తదితరులు